క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్ల వంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 35, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పీహెచ్‌డీ 'వైవ'కు జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి హాజరు


జస్టిస్ వెంకటేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్న హైకోర్టు సిట్టింగ్ జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి మంగళవారం ఓయూ లా కాలేజీలో జరిగిన వైవకు హాజరయ్యారు. లా డీన్ ప్రొ.గాలి వినదోకుమార్ పర్యవేక్షణలో అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ ఇన్ ఇండియా ది కాన్సెప్ట్ ఆఫ్ ప్లీ బార్గనింగ్ ఏ క్రిటికల్ స్టడీ అనే అంశంపై పరిశోధన చేస్తున్నారు. త్వరలో డాక్టరేట్‌ను అందుకోనున్న జస్టిస్ వెంకటేశ్వర రెడ్డిని ప్రొ.వినోద్‌కుమార్, సీనియర్ అధ్యాపకులు ప్రొ.జీబీరెడ్డి, ప్రిన్సిపల్ రాధికయాదవ్, డాక్టర్ అపర్ణ పుష్పగుచ్ఛాన్ని అందజేసి సన్మానించారు.

నేటి నుంచి టీఎస్‌సెట్ హాల్ టికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్-2022 హాల్ టికెట్లను నేటి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కోఆర్డినేటర్ ప్రొ.నరేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలో జరిగే తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్)కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కంది శైలజ

బౌద్ధనగర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. రామ్‌కీ బృందం ఆధ్వర్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. అదే విధంగా చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ, రోడ్లపై వేయకూడదని సూచించారు. ఇళ్లలోని చెత్తను తడి,పొడి వేరుచేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామ్‌కీ బృందం ఇన్‌చార్జి మానస, శ్రావణ్ కుమార్, అపోలో స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఠాణా ప్రాంగణం పరిశీలన


స్థానిక నాయకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

చిలకలగూడ: బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వారాసిగూడ ఠాణా ప్రాంగణాన్ని మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, ఏసీపీ శ్రీనివాసరావు సందర్శించారు. మొదటి అంతస్తులో స్టేషన్, రెండవ అంతస్తులో చిలకలగూడ ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కార్పొరేటర్ కార్యాలయం, కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజతో పోలీస్ అధికారులు మంతనాలు జరిపారు. గ్రౌండ్‌ఫ్లోర్‌ను ఠాణా కోసం కేటాయించాలని, ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు మొదటి అంతస్తు ఎక్కాలంటే ఇబ్బంది పడతారని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వారాసిగూడ ఠాణాను అధికారికంగా ప్రారంభించనున్నారు.

ఇన్‌చార్జి ఏసీపీగా శ్రీనివాసరావు..

చిలకలగూడ డివిజన్ ఇన్‌చార్జి ఏసీపీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. గతంలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన ఆయన క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఠాణాలను కలిపి చిలకలగూడ డివిజన్ ఏర్పాటు చేశారు.

చిట్టి బుర్రలు ఆలోచింపచేసే ఆవిష్కరణలు

- అబ్బుర పరిచిన సైన్స్ ఎగ్జిబిషన్
- సెయింట్ ఆంథోని ఎస్పీజీ స్కూల్‌లో వివిధ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులు


కాళేశ్వరం ప్రాజెక్ట్ నమూనాతో నిషి, హరిణి, ధనుష్క


అస్థిపంజరం గురించి వివరిస్తున్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: మానవ శరీరంలోని వివిధ రకాల వ్యవస్థలు వాటి పనితీరు..ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం, నీటి ఒత్తిడితో జేసీబీ పనితీరు, ప్రపంచంలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ఇలా ఒకటేమిటి వివిధ అంశాలతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆలోజింపజేసింది. చిన్నారుల మెదళ్లలో నుంచి పుట్టుకొచ్చిన సరికొత్త ఆలోచనలను ఆవిష్కరించి చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ ఆంథోనీ ఎస్పీజీ హైస్కూల్ వేదికైంది. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వివిధ రకాల నమూనాలను తయారుచేసి వివరించిన తీరు ఆకట్టుకుంది. మనిషి శరీరంలో కండరాలు, నాడీ వ్యవస్థ, రక్త ప్రసరణ, తెలంగాణాలో అతిపెద్ద ప్రాజెక్టు అయిన కాళేశ్వరం, మట్టి కుండలతో ఫ్రిజ్ తయారీ హైలెట్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం రేణుక ఎలిజబెత్ మాట్లాడుతూ.. మానవ జీవితంలో అనేక సవాళ్లకు సైన్స్ పరిష్కారం చూపిస్తుందన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు చిన్నారుల్లో సరికొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయని వారికి సైన్సు పట్ల ఆసక్తి కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు దాస్ రాబర్ట్, కరస్పాండెంట్ ఉదయ్ శ్యాముల్, బిషప్ రైట్ రెవరెండ్ మోజస్ ఆశీర్వాదం పాల్గొన్నారు.

తార్నాకలో

లాలాపేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తార్నాకలోని శ్రీ చైతన్య స్కూల్లో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సౌమ్య పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే సైన్స్ ప్రదర్శనలు నిర్వహించడంతో విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, డీన్ మహిపాల్‌రెడ్డి, రేచల్, టీచర్లు సుధాకర్ రాజు, మధుకర్, స్మృతి, సునీత, సాహితీ, స్రవంతియ పాల్గొన్నారు


వివిధ నమూనాలతో విద్యార్థులు


సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రొ. సౌమ్య

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

చిలకలగూడ: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ విద్యార్థి విభాగం నేతృత్వంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, వర్ధమాన క్రీడాకారులకు అన్నివిధాల ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగ నాయకుడు యాదా క్రాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్‌చందర్, జగన్, ప్రశాంత్, పృథ్వీ, అనీల్, రాఘవేంద్ర, హేమంత్, ప్రణీత్ పాల్గొన్నారు.

అమ్మోరుకు అలంకరణ



సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో పోచమ్మ అమ్మవారి నాల్గో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 108 కలశములతో పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు.

7 నుంచి ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని సెల్ట్‌లో మార్చి 7 నుంచి ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ఉదయం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సవీన్ మంగళవారం తెలిపారు. రెండు నెలల పాటు జరిగే శిక్షణ తరగతులకు పది ఆపై విద్యార్హతలు గల ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగులు, గృహిణులు, ఇంగ్లిష్ భాష మాట్లాడాలని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వం ప్రశ్నించే గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తోంది

మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి


బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తోందని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు.కళాసీగూడలో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. దాసారంబస్తీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బస్తీ దవాఖానాగా మార్చాలనే మంత్రి నిర్ణయాన్ని బస్తీ ప్రజలందరు వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనికి అభ్యంతరం చెబుతున్న బస్తీ నాయకుడిపై పోలీసులతో కేసులు పెట్టిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని వారికి నేను అండగా ఉంటానన్నారు. ప్రజలను బెదిరించి పాలన చేయాలనుకోవడం తప్పని ఇలాంటి ధోరణిని వీడనాడాలన్నారు.కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేంద్రం నిధులు ఇవ్వలేదని రాష్ట్రం ప్రభుత్వం ఆరోపణలు చేస్తుందని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. రేషన్ కార్డులు, హెల్త్ సెంటర్, వ్యాక్సినేషన్ ఇలా అన్ని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర నిధులు లేవా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, నాయకులు చీర శ్రీకాంత్, ఎస్ఆర్ మల్లేష్, దయానంద్, ప్రతాప్ పాల్గొన్నారు.

బోలక్‌పూర్‌లో..

పద్మారావునగర్: రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలను సన్నద్ధం చేయాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. బోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణలో కల్వకుంట్ల పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇంటికో ఉద్యోగం అని చెప్పి రాష్ట్రం అనంతరం తన కుటుంబలో అందరికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉద్యోగాలు ఇచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. రాజశేఖరరెడ్డి, సత్యనారాయణ, పురురవరెడ్డి, వై. సురేష్‌కుమార్, శీలం శివలింగం పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలని ఐక్యవిద్యార్థి సంఘాల నేతలు కోరారు. ఓయూలో ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినదోకుమార్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వీసీ ప్రొ.రవీందర్ పీహెచ్‌డీ ప్రవేశాలలో రాష్ట్ర రిజర్వేషన్ల విధానాన్ని పాటించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీల రిజర్వేషన్ విధానంతో పీహెచ్‌డీ ప్రవేశాలు చేపడుతున్నారని బీసీ రిజర్వేషన్ల బదులు ఓబీసీ రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లను పాటించకుండా మిగిలిన సీట్లను వచ్చే నోటిఫికేషన్‌కు బదిలీ చేయాలనుకుంటున్నారని వినోద్‌కుమార్‌కు వివరించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ వైద్య విద్యార్థి డా.ప్రీతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని ఓయూ గణితశాస్త్రం విభాగం హెచ్ఓడీ ప్రొ.కిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఆపత్కాలంలో రక్షించుకోవడంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

సనత్‌నగర్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్ఎంసీ విపత్తు స్పందన దళం (డీఆర్ఎఫ్) సభ్యులు అమీర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఎఫ్ ప్రతినిధులు ఆపద వేళల్లో వినియోగించే వస్తువులను ప్రదర్శించారు. వాటిని వినియోగించి ఎలాంటి పనులు చేస్తారో విద్యార్థులకు వివరించారు. వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, చెట్లు కూలిన సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో చేసి చూపించారు. అగ్నిమాపక సాధనాలను వినియోగించే విధానం, భూకంపం తలెత్తినప్పుడు ఇళ్లల్లో ఉండకుండా బహిరంగ ప్రదేశాలకు వెళ్లడం, వరదల్లో స్పందించాల్సిన అవసరాల గురించి వివరించారు.

బాబూ రాజేంద్రప్రసాద్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: బాబూ రాజేంద్రప్రసాద్ సేవలు చిరస్మరణీయమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన బాబు రాజేంద్ర ప్రసాద్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి మొదటి రాష్ట్రపతిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుద్దాల సురేష్, కుమార్ పాల్గొన్నారు.

గణేష్ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఆలయ పనులపై ఆరా తీస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: అమీర్‌పేట డివిజన్ గురుమూర్తినగర్‌లోని గణేష్ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన ఆలయాన్ని సందర్శించిన దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆలయం వెనుక ఉన్న రేకుల షెడ్డు, షాపులను తొలగించి నూతన షాపులు, ఆఫీస్ రూమ్, కిచెన్, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఆలయం, ముఖద్వారానికి పెయింటింగ్ చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట ఈఓ నరేందర్‌రెడ్డి, నాయకులు హన్మంతరావు, సంతోష్, ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌యాదవ్, హరిసింగ్, ఉమానాథ్‌గౌడ్, గుడిగె శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

తుంగ బాలుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జియాలజీ విభాగంలో తుంగబాలుకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ ప్రొఫెసర్ రత్నాకర్ పర్యవేక్షణలో పెట్రోలజికల్ అండ్ జియోకెమికల్ స్టడీస్ ఆన్ ద యాదగిరిగుట్ట గ్రానైట్స్ యాదాద్రి భువనగిరి డిస్ట్రిక్ తెలంగాణ స్టేట్ సదరన్ ఇండియా అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి గతంలో టీఆర్ఎస్‌లో వివిధ పదవులు చేపట్టిన బాలు ప్రస్తుతం బీఆర్ఎస్ విద్యార్థి విభాగానికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

ఐసిడోర్ పిలిఫ్స్‌కు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎడ్యుకేషన్ విభాగం (విద్య)లో ఐసిడోర్ పిలిఫ్స్‌కు పీహెచ్‌డీ డాక్టర్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.సుధాకర్ పర్యవేక్షణలో యన్ ఇన్వేస్టిగేషన్ ఇంటు ద ప్రైమరీ స్కూల్ ఎవల్యూయేషన్ సిస్టమ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్ స్ట్రాటజీస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శ్రీమదలర్మేల్‌మంగా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత నెల 27న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మంగళవాయిద్యం, సుప్రభాతసేవ, నిత్య ఆరాధన, సేవాకాలం, బాలభోగం, తీర్థప్రసాద్ గోష్ఠి, యాగశాల ప్రవేశం, ద్వారతోరణ పూజ, అగ్ని ప్రతిష్ఠ, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు తిరుకల్యాణం..

బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీవార్ల దివ్య తిరుక్కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మూలమంత్ర హోమాలు, రాజభోగం, తీర్థగోష్టి, 6 గంటలకు సనత్‌నగర్ తిరువీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుందని 3న బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ కీలకం

ఈఎంఆర్ఐ ప్రతినిధి వెంకటనారాయణరెడ్డి


అవగాహన కల్పిస్తున్న వెంకటనారాయణరెడ్డి

సనత్‌నగర్: మనిషి ప్రాణాలను కాపాడడానికి గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని ఈఎంఆర్ఐ ప్రతినిధి వెంకటనారాయణరెడ్డి తెలిపారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) సిబ్బందితో పాటు ప్రజలకు మెడికల్ ఎమర్జెన్సీ, గోల్డెన్ అవర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన వెంకట నారాయణరెడ్డి ఎమర్జెన్సీ సమయంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ముఖ్యంగా గుండెపోటుతో మనిషి కుప్పకూలినప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఎలాంటి ప్రమాదానికి లోనైనప్పటికీ మనిషి ప్రాణాలు నిలబడేందుకు ఆస్పత్రికి తీసుకెళ్లే సమయం ఎంతో ముఖ్యమని ఆ సమయాన్నే గోల్డెన్ అవర్‌గా పేర్కొంటారని, ఆ సమయంలో రోగికి చేయాల్సిన ప్రథమ చికిత్సలు కూడా ప్రాణాలను కాపాడుతాయన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాజు సింగ్

రసూల్‌పురా/కంటోన్మెంట్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్ఎస్ నాయకులు రాజుసింగ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని తాడ్‌బండ్, బాలంరాయి. మడ్‌ఫోర్ట్, మారేడుపల్లి, పాస్‌పోర్ట్ ఆఫీస్, సికింద్రాబాద్ మథర్ థెరిస్సా విగ్రహం సమీపంలో ఆరు ప్రాంతాల్లో శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజుసింగ్ మాట్లాడుతూ.. మానవతా సేవతో ఫౌండేషన్ గత 12 ఏళ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కుట్టు మిషన్లు, చెరుకు రసం మిషన్లు, అందజేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, శరత్, షేక్ ఖాజా, విక్కి, సాయి, భాస్కర్ గౌడ్, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

30 ఏళ్లు పనిచేస్తే..ఉట్టి చేతులతో పంపిస్తారా?

ఉద్యోగ విరమణలో ఓయూ ప్రొఫెసర్ దీక్ష



ఉస్మానియా యూనివర్సిటీ: 'ఓయూలో 30 ఏళ్లు పనిచేస్తే ఉట్టి చేతులతో బయటకు పంపిస్తారా.. ఇది చాలా అన్యాయం' అంటూ ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్ నిరసనకు దిగారు. ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అన్సారీ మంగళవారం పదవీ విరమణ చేశారు. అయితే కోర్టు కేసుల కారణంగా ఆయనకు ఇంత వరకు చేసిన సర్వీసును లెక్కించకపోవడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు, పెన్షన్‌కు అనర్హుడని తేల్చారు. ఈ విషయం తెలిసి విస్మయానికి గురైన అన్సారీ ఇదెక్కడి అన్యాయమంటూ వీసీ చాంబర్ ఎదుట దీక్షకు దిగి తనకు న్యాయం చేయాలని ప్లకార్డు ప్రదర్శించారు. విద్యార్థి, అధ్యాపకునిగా ఓయూతో సుమారు 40 ఏళ్ల అనుబంధం ఉన్న తనకు ఇంతటి అన్యాయం జరగడం దారుణమన్నారు. ఇన్నేళ్లు ఇక్కడ పనిచేసి ఒక్క రూపాయి కూడా లేకుండా ఇంటికి వెళ్లి కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొ.అన్సారీ దీక్షకు పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల న్యాయకులు సంఘీభావం తెలిపారు. కాగా గతంలో అన్సారీ నియామక ప్రక్రియపై కొంత గందరగోళం నెలకొన్నందున దీనిపై వచ్చే వర్సిటీ ఈసీ సమావేశంలో చర్చించి తగు న్యాయం చేస్తామని ఓయూ రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

ఉద్యోగ విరమణ..

ఓయూ ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ప్రొ.అన్సారీని సన్మానించి ఆయనతో తనకు ఉన్న స్నేహ సంబంధాల గురించి వివరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొ.అన్సారీ సేవలను యూనివర్సిటీ విద్యార్థులు ఎన్నడూ మర్చిపోరని జేఏసీ ఛైర్మన్ గద్దెల అంజిబాబు పేర్కొన్నారు.